క్లుప్తంగా

స్కాలర్‌షిప్పులు ప్రతి విద్యార్థికి అందాలి

పీలేరు : హాస్టల్లో ఉండి చదువుతున్న ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్పులు అందాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు డి. జాకీర్ హుసేన్ అన్నారు. శనివారం పీలేరు సహాయ సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని హాస్టల్ వార్డెన్లు, విద్యా సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెనకు సంబంధించి పెండింగ్‌లను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా మదర్‌థెరిసా జయంతి

వాల్మీకిపురం : విశ్వమాత మదర్ థెరిసా జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ మదర్‌థెరిసా 45 సంవత్సరాల పాటు మిషనరీస్ ఆఫ్ ఛారిటీని భారతదేశంలో, ప్రపంచంలోని ఇతర దేశాలలో వ్యాపించేలా మార్గదర్శకత్వం వహిస్తూ పేదలకు, రోగులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్న వారికి పరిచర్యలు చేశారన్నారు. మదర్ సేవకు గాను 1979లో నోబెల్ శాంతి బహుమతి, 1980లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పొందారన్నారు.

కలికిరికి చేరుకున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

కలికిరి : ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి శనివారం సాయంత్రం కలికిరి ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్నారు. బీజేపీ తీర్థంపుచ్చుకున్న తరువాత మొదటి సారి ఆయన స్వగ్రామానికి వచ్చారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఆయన రాజంపేట పార్లమెంటు, నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు పుంగనూరు నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు నిమ్మనపల్లి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులను గుర్తించాలి

పీలేరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ప్రాణాంతక వ్యాధులను గుర్తించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శనివారం స్థానిక యల్లమంద క్రాస్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్, బీపీ, థైరాయిడ్, క్యాన్సర్, గుండెజబ్బులు లాంటి వ్యాధులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి పౌరుడికీ హెల్త్ ఐడీ నెంబర్ ఆధార్‌కార్డుతో లింక్ చేయడం జరుగుతోందన్నారు. తద్వారా దేశంలో ఎక్కడైనా డేటా చెక్ చేసుకుని చికిత్స పొందవచ్చునని తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపరచండి

కురబలకోట : సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) శిక్షణ పూర్తి చేసిన ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని మదనపల్లె ఆర్డీఓ మురళి సూచించారు. ఆరు రోజుల పాటు మండలంలోని అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాకు చెందిన యూపీ, ప్రాథమిక స్కూళ్ల హెడ్మాస్టర్లకు జరిగిన రెసిడెన్షియల్ సాల్ట్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథి ఆర్డీఓ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వాటిని పాఠశాల స్థాయిలో ఆచరించి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని గుర్తించాలన్నారు.

రుక్సానా హత్యకేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన రుక్సానా హత్యకేసును సీబీఐకి అప్పగించాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గొంగడికృష్ణమూర్తి, ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ) జిల్లా నాయకులు కే.సోమశేఖర్, పి.శ్రీరాములు, బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాలమోహన్, మదనపల్లె న్యాయవాదుల సంఘం కోశాధికారి జి.ఎన్.సురేష్‌బాబు, రుక్సానా మామ ఖాదర్‌వల్లీ తదితరులు ప్రసంగించారు. ఏదైనా కేసులో ఎఫ్ఐఆర్ ఒకసారి నమోదైన తర్వాత సవరణలు చేసుకోవచ్చు కానీ ఫిర్యాదును మార్చడం చట్టవిరుద్ధమన్నారు. రుక్సానా కేసులో ఒకే ఎఫ్ఐఆర్‌లో రెండు ఫిర్యాదులు, రెండు రకాల నిందితుల జాబితా ఉందన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు రుక్సానా హత్యకేసులో తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం అందించండి

నిమ్మనపల్లె : బాల్యవివాహాలపై సమాచారం అందించాలని సీడీపీఓ సుజాత అన్నారు. శనివారం రాచవేటివారిపల్లె దిగువమాచిరెడ్డిగారిపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు, చిన్నపిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు.

రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సింగల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సహకార బ్యాంకు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సింగల్‌విండో అధ్యక్షుడు నిర్గాల శ్రీధర్ రాయల్, డైరెక్టర్లుగా నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందించాలన్నారు. బంగారు ఆభరణాలు, గ్రూపు రుణాలు, స్వయం ఉపాధి రుణాలు, వ్యవసాయ పాసుపుస్తకాలు తదితర వాటిపై రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పార్టీ కష్టకాలంలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అన్ని కులమతాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. పదవి ఉన్నప్పుడు ప్రజల మన్ననలు పొంది, పదవికి వన్నెతెచ్చే విధంగా పని చేయాలన్నారు. అనంతరం సింగల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రాయల్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎళ్లవేలలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, రాయుడు, అబ్దుల్ కలీమ్, మహబూబ్‌బాషా, షాహెద్, సాధిక్, మదనమోహన్ రెడ్డి, నరసింహులు, సాగుబడి ఆనంద రెడ్డి, ఓరుగంట రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా

పీలేరు : నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 25 బహుళజాతి కంపెనీలు వచ్చాయన్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన దాదాపు 2 వేల మందికి సర్పంచ్ హబీబ్‌బాషా భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. మొత్తం 1323 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 394 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, జీ.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఎస్‌వి. చలపతి, హరిత, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మహితాఆనంద్, డాక్టర్ వెంకటరామయ్య, హుమయూన్, ఆఫ్గామోహిద్దీన్, నారే వెంకటరమణారెడ్డి, అమరనాథరెడ్డి, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

మదనపల్లె సిటీ: శ్రావణ మాసం రెండో శనివారం పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. గోవిందనామాలతో ఆలయం మార్మోగింది. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, అర్చకులు గోవర్ధన్‌భట్టార్‌లు పాల్గొన్నారు. స్థానిక బసినికొండపై వెలసిన శ్రీ వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు కొండపై ఉన్న స్వామి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని అడ్డకొండలో వెలసిన శ్రీపురాతన గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండవ శనివారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కొండ భక్తుల గోవింద నామస్మరణలతో మారుమోగింది. అలాగే మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి ఆలయంలో, చెంబకూరులోని గట్టు వెంకటేశ్వరస్వామి ఆలయంలో, తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం పూజలు నిర్వహించారు. ఎస్ఐ చంద్రశేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు


జగనన్న కాలనీలో తాగునీటి కుళాయిలను పరిశీలిస్తున్న పీడీ మద్దిలేటి

కలికిరి : కలికిరి సీఎల్ఆర్‌పీ కార్యాలయ సమీపంలో ఏర్పాటైన జగనన్న కాలనీ త్వరలో జిల్లా స్థాయిలో ప్రారంభానికి వేదిక కానుంది. ఇటీవల జిల్లా కలెక్టరు గిరిషా పీఎస్ పర్యటించి జగనన్న కాలనీ ప్రారంభానికి అవసరమైన విద్యుత్ సదుపాయం, తాగునీటి కుళాయిలు, రోడ్లు, ప్రారంభ ఆర్చి తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కాలనీకి దారి సమస్య ఉండటంతో సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలం ఆక్రమణలుంటే తొలగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ మేరకు ప్రభుత్వ స్థలం ఆక్రమణను గుర్తించి అక్రమ కట్టడాలను తొలగించి దారి సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం కాలనిలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను డ్వామా పీడీ మద్దిలేటి, హౌసింగ్ ఈఈ వెంకటదాసుతో కలిసి పరిశీలించారు. పెండింగ్ పనులు ఉంటే త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ గంగయ్యను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మధుబాబు, తహసీల్దారు భాగ్యలత, ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పల్లెబాట


యర్రగుట్టపల్లెలో పల్లెబాట నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దమండ్యం : ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులతో కలిసి పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని కలిచెర్ల గ్రామ పంచాయతీలో ఉప్పరపల్లె, బాటవారిపల్లె, యర్రగుట్టపల్లె, కలిచెర్ల హరిజనవాడ, కలిచెర్ల గ్రామాలలో శనివారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న విధానం గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఆమె అన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ రషీదా, సర్పంచ్‌లు జింకా విశ్వనాథ, సోదనపల్లె బాషా, కంటి విశ్వనాథరెడ్డి తితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాలిక్



బి.కొత్తకోట : బి.కొత్తకోటకు చెందిన పి.మాలిక్ వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించిన జిల్లా కమిటీలో చోటు దక్కింది. గతంలో పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యునిగా, ఉపసర్పంచుగా మాలిక్ పనిచేశారు. జిల్లా కమిటీలో గట్టుకు చెందిన పార్టీ నాయకుడు మియాసాబ్‌కు జిల్లా కార్యవర్గ సభ్యుడిగా చోటు దక్కింది. మియాసాబ్ సతీమణి ముబీనా సర్పంచ్‌గా పనిచేశారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు రూరల్ : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్. ఆనంద్ అన్నారు. శనివారం డిగ్రీ కళాశాల నుంచి రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కోసం ఐదు కిలోమీటర్ల పరుగు పందెం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్య విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాయామం, పౌష్టికాహారం ప్రతి మనిషికి రోగాల నుంచి దూరం చేస్తాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఓటర జాబితా పరిశీలన పక్కాగా జరగాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : బీఎల్వో, బీఎల్ఏ, సూపర్‌వైజర్లు ఇంటింటికీ సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకుని, ఓటరు జాబితాను పరిశీలించి అందులో పేర్లు తొలగిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శనివారం సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె మండలం, మున్సిపల్ టౌన్ హాల్‌లో మున్సిపాలిటీకి చెందిన బీఎల్వో, బీఎల్ఏలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ పర్మినెంట్ ఓటర్లను డిలీట్ చేయవద్దన్నారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రంకు వెళ్లిన వారిని ఫారం-8ను ఉపయోగించి కరెక్షన్స్ చేస్తే ఆటోమేటిక్‌గా ఫారం-7 జనరేట్ అవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ డిలీషన్‌కు సంబంధించి ప్రొఫార్మా-ఏ,బీలను ప్రతిపాదించిందన్నారు. ఓటరుజాబితా నుంచి ఎవరిపేర్లను అయినా తొలగించేటప్పుడు కచ్చితంగా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి, సరైన ఆధారాలు చూపించి వారి అంగీకారంతోనే తొలగించాలన్నారు. బీఎల్వోలకు వారి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. సెలవులు, ఇతర కారణాలు చెపుతూ ఓటరు సర్వే విధుల్లో నిర్లక్ష్యం కనపరిస్తే బీఎల్వోలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ దైవరాజన్ ఓటర్ల జాబితా ప్రక్రియపై వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మరణించిన వారి ఓటర్లు విషయంలో మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించాలన్నారు. ఓటరుజాబితా పక్కాగా ఉండాలన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

నిమ్మనపల్లె : ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్.బి.రమేష్ బాబు తెలిపారు. శనివారం రాచవేటివారిపల్లె గ్రామంలోని ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలకు చికిత్సలు అందించి మందులను పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్ద చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యసిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్.ఎల్.హెచ్.పిలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే పథకాలు

కురబలకోట : పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి తెలిపారు. శనివారం వనమరెడ్డిగారిపల్లె పంచాయతీలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్ పెద్ద గాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో పల్లె బాట నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సీటీఎం రోడ్డు నుంచి కోనంగివారిపల్లె వరకు రూ.85 లక్షలతో, గొర్లవారిపల్లెకు రూ.55 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరు పడుతున్నాయని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలన్నారు. సీఎం జగన్‌లా వివిధ పథకాలు అమలు చేసిన వారు గతంలో లేరన్నారు. భవిష్యత్తులో కూడా ఉండబోరని గుర్తించాలన్నారు. వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా ఆదరించాలని కోరారు. ఎన్వీ రమణారెడ్డి, ఎంపీడీఓ దిలిప్‌కుమార్, సోమిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, లోకేష్ వెలుగు ఎపిఎం నీరజ, వెంకటేష్, ఏఓ రాధ, ఇంజినీరు మధు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

బి.కొత్తకోట : సమస్యలను పరిష్కరించడం కోసం పల్లెబాట కార్యక్రమం చేపట్టినట్టు ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర అన్నారు. శనివారం మండలంలోని వేమిలేటికోట పంచాయతీలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజల నుంచి అందిన వినతులను స్వీకరించి అధికారులకు అందజేశారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, సర్పంచు మారెడ్డి రవికుమార్‌రెడ్డి, భీమగాని నాగిరెడ్డి, లక్ష్మీదేవి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ అరుణ్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ నాసిర్, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అనసూయమ్మ

తంబళ్లపల్లె : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ అనసూయమ్మ కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అధికారులు ప్రధాన పాత్ర పోషించి అర్హులకు అందేలా చూడాలన్నారు. ప్రతిశాఖ ద్వారా సామాన్య ప్రజలకు అందించాల్సిన సేవలు సకాలంలో అందించాలన్నారు. ఎలాంటి విమర్శలు, ఆరోపణలకు తావివ్వకుండా అధికారులు జాగ్రత్త పడాలన్నారు. మండల సమావేశాలకు అన్నిశాఖల అధికారులు సమాచార నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్ పోటీలు


క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీ శాప్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్

మదనపల్లె : మండలంలోని ఆరోగ్యవరం ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఈనెల 21 నుంచి జరుగుతున్న సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. వారం రోజులుగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 16 జట్లు పోటీల్లో పాల్గొని ఫుట్‌బాల్ ప్రేక్షకులకు కనువిందు చేశాయి. నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న పోటీల్లో లీగ్, సెమీస్ మ్యాచ్‌ల్లో శనివారం జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో మొదటిమ్యాచ్‌లో వైజాగ్, కాకినాడ జట్ల మధ్య జరిగిన పోటీల్లో వైజాగ్ 5 గోల్స్, సెకండ్ సెమీ ఫైనల్‌లో హైదరాబాద్, చెన్నై జట్ల మధ్య జరిగిన పోటీల్లో హైదరాబాద్ 1 గోల్స్‌తో గెలుపొందాయి. ఆదివారం సాయంత్రం మధ్యాహ్నం 3 గంటలకు వైజాగ్ వర్సెస్ హైదరాబాద్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందన్నారు. మూడో, నాలుగో స్థానాలకు కాకినాడ వర్సెస్ చెన్నై జట్ల మధ్య పోటీ జరుగుతుంది. శనివారం జరుగుతున్న సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలకు ఏపీ శాప్ డైరెక్టర్, ఏపీఎఫ్ఏ జనరల్ సెక్రటరీ డేనియల్ ప్రదీప్ హాజరై క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారు.